
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

ఆదివారం 6 ఏప్రిల్ 2025

సహస్రలింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస సహస్రలింగాల ఆలయంలో శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ నలుమాసు గంగాధర్,అర్చకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న కోరుట్ల పట్టణంలోని కింగ్ గార్డెన్‌లో నిర్వహించే ఉచిత మెగా క్యాంపు విజయవంతం చేయాలని కోరుట్ల, మెట్‌పల్లి గైనకాలజిస్ట్ సొసైటీ అధ్యక్షురాలు వైద్యులు స్వీటీ అనూప్, ఐఎంఏ నాయకులు అనూప్‌రావు, రాజేష్ శనివారం కోరారు. కోరుట్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కోరుట్ల, మెట్‌పల్లి ఆబ్‌స్ట్రేటిషన్, గైనాకాలజిస్ట్ సోసైటీ, జమాత్ ఇస్లామిక్ హిందు, వుమన్స్ వింగ్ కోరుట్ల వారు సంయుక్తంగా నిర్వహించే ఉచిత హెల్త్ క్యాంపును విజయవంతం చేయాలన్నారు. క్యాంపులో రొమ్ముకాన్సర్, గర్భాశయ ముఖ ద్వార కాన్సర్, బోన్ డెన్సిటి స్కానింగ్‌లు నిర్వహించి ఈసీజీ, హెచ్‌బి, షుగర్ టెస్టులను ఉచితంగా చేస్తారని తెలిపారు. వైద్య శిబిరంలో పిల్లల, కంటి, దంత, గైనకాలజి స్టులు, జనరల్ ఫిజీషియన్, సర్జన్, ఎము కల వైద్య నిపుణులు వైద్య సేవలు అందిం చనున్నారని తెలిపారు.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : యాదవ మండల నూతన కార్యవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ ప్రకటించారు. శనివారం మోహన్ రావుపేటలో మండల యాదవ సంఘ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కార్యవర్గం ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల సంఘ అధ్యక్షుడిగా బినవేని రంజిత్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా అంగా మహేష్ యాదవ్, కోరుట్ల పట్టణ అధ్యక్షుడుగా రమేష్ యాదవ్, ప్రదాన కార్యదర్శిగా సాయికుమార్ యాదవ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు రెబ్బటి రాజశేఖర్ యాదవ్, యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేష్ యాదవ్, సంఘ సభ్యులు కుంభం మహేష్ యాదవ్, గడెల రాజు యాదవ్, రెబ్బాస్ మధు యాదవ్, కసాడి గంగాధర్ యదవ్, రామ్‌యాదవ్ పాల్గొన్నారు.



నిబంధనలు బేఖాతరు

అధిక మొత్తంలో ఫీజులు వసూలు

పలు ఇంటర్ కాలేజీల్లో నీట్, ఐఐటీ కోచింగ్

అనుమతులు లేకుండానే నిర్వహణ

ప్రభుత్వం సెలవులు ప్రకటించినా పట్టించుకోని వైనం

ప్రేక్షకపాత్ర వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

జగిత్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రైవేటు జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా నీట్, ఐఐటీ కోచింగ్ పేరిట తరగతులు నిర్వహిస్తూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయి. తమ పిల్లలు ఇంజినీర్, డాక్టర్ కావాలన్న విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలను ప్రైవేటు విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఇటీవల ఈ కోర్సులకు డిమాండ్ రావడంతో ప్రైవేటు ఇంటర్ కళాశాలలతో పాటు కోచింగ్ సెంటర్లు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. అయితే ప్రభుత్వం గత నెల 29 నుంచి ఇంటర్ కళాశాలలకు సెలవులు ప్రకటించింది. కానీ జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రధాన పట్టణాల్లోని చాలా ప్రైవేటు ఇంటర్ కళాశాలల్లో విద్యార్థులకు ఐఐటీ, నీట్, ఎప్‌సెట్ వంటి వాటిపై కోచింగ్ నిర్వహిస్తున్నారు.

జిల్లాలో అన్ని రకాల కోచింగ్ సెంటర్లు కలిపి 30కి పైగా ఉండగా, వీటిలో సుమారు 5 వేల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్లు అంచనా. ఇందులో ఏ ఒక్క కోచింగ్ సెంటర్‌కు కూడా ప్రభుత్వం నుంచి అనుమతులు లేవని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ యథేచ్ఛగా కళాశాలల్లో ఉదయం నుంచి రాత్రి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఐఐటీ, నీట్ కోచింగ్‌లకు ఆయా కళాశాలల యాజమాన్యాలు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇందులో షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ పేరిట ఫీజులు నిర్ణయిస్తున్నారు. ఐఐటీ, నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు ఎక్కువ మొత్తంలో, షార్ట్‌టర్మ్ తక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. దీనికి తోడు బ్రిడ్జి కోర్సు పేరిట ఐఐటీ-జేఈఈ పరీక్ష కోసమని ప్రత్యేక ఫీజులను ప్రకటిస్తున్నారు. తరగతులు ఫలానా తేదీ నుంచి ప్రారంభిస్తామని బహిరంగంగానే ప్రకటనలు సైతం ఇస్తున్నారు. కొన్ని ప్రైవేటు కళాశాలలు రెండు, మూడు బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి శిక్షణఇస్తు న్నారు.

వీటితో పాటు గురుకుల, నవోదయ, ఆర్మీ స్కూల్ వంటి వాటికి రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు ఇంటర్ కళాశాలలు నిర్వహిస్తున్న భవనాల్లోనే కోచింగ్ పేరిట యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని పలు విద్యార్థి సంఘాలు, యువజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

దొనికెల నవీన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



ప్రభుత్వం జూనియర్ కళాశాలలకు సెలవులు ప్రకటించినా నిబంధనలకు విరుద్ధంగా ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. ఇంటర్మీడియట్ శాఖ అధికారులు ఆయా కళాశాలల్లో తనిఖీలు చేపట్టడం లేదు. కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

కళాశాలలు మూసివేయాలి

బొప్పరాతి నారాయణ, ఇంటర్ జిల్లా విద్యాధికారి



జిల్లాలోని జూనియర్ కళాశాలల విద్యార్థులకు సెలవులు ఇవ్వాలని, ఎలాంటి తరగతులు నిర్వహించరాదని కమిషనర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకుంటాం. ఏ కళాశాలలో అయినా విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవు.

కొండగట్టులో భక్తుల సందడి 7 | ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు గ్రహణం 8 | తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు 8

'పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి'



మేడిపల్లిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, ఏప్రిల్ 5: పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పథకాన్ని మేడిపల్లిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పేద ప్రజలకు సన్న బియ్యం అందించాలనే ఒక ధృడ సంకల్పంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, ఎంపీడీఓ, ఎంపీఓ మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, మండల పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **భీమారం:** మండల కేంద్రంలో శనివారం సన్న బియ్యం పంపిణీని అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం మన్నెగూడెం, ఈదుల లింగంపేట, దేశాయిపేట గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, ఆర్డీవో జివాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్ యాదవ్, ఎంపీడీవోలు పద్మావతి, నీరజ, మండల అధ్యక్షులు నరేష్ రెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలి

కోరుట్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణకు పోరాటాలకు ప్రతి పౌరుడు సిద్ధం కావాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యుడు కత్తి వెంకటస్వామి పిలుపునిచ్చాడు. శనివారం పట్టణంలో సినారే భవనంలో జై బాపు జైభీమ్ జై సంవిదాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులతో కలిసి నిర్వహించారు. జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కార్యక్రమంపై రూపొందించిన లఘు చిత్రంను ప్రదర్శించి నాయకులు కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదని, ప్రపంచంలో గొప్ప రాజ్యాంగంగా భావిస్తారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీసేలా బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ప్రజా స్వామ్య విలువలను కాలరాస్తూ సమాజంలో అశాంతిని నెలకొల్పుతూ విభేదాలను సృష్టి స్తూ రాజకీయ మనుగడ కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తుందని ఆరోపిం చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయ కులు తిరుమల గంగాధర్, కొంత రాజం, సత్యానారాయణ గౌడ్, జెట్టి లింగం, అంజిరెడ్డి, అల్లూరి మహేందర్ రెడ్డి, పుండ్ల శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వెంకటేస్ గౌడ్, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆడెపు మధు, పుప్పాల ప్రభాకర్, నగునూరి గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

కల్యాణానికి ముస్తాబైన రామాలయాలు

నేడు శ్రీరామ నవమి



రాంనూర్‌లో పాల పొరక తెస్తున్న భక్తులు

కొడిమ్యాల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి మండల కేంద్రంలోని రామాలయం ముస్తాబైంది. ఆలయాన్ని ఆలయ కమిటీ, గ్రామ ప్రముఖుల ఆద్వర్యంలో సున్నం, రంగులను వేయించి ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయం ముందు పందిళ్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. కల్యాణ ఏర్పాట్లను శనివారం నల్లగొండ ఆలయ అధికారులు పరిశీలించారు.

● **వెల్గటూర్:** మండలంలోని వివిధ గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలను సిద్ధం చేశారు. రాంనూర్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం పాల పొరక కార్యక్రమం నిర్వహించారు. భాజా భజంత్రీల మధ్య గ్రామ శివారు నుండి పాల పొరకను తెచ్చి పచ్చని పందిరి వేశారు. అంజనేయ స్వామి మాలధారులు భక్తితో స్వామి వారిని కొలిచి ప్రత్యేక పూజలు చేశారు. వెల్గటూర్, రాజక్కపల్లి, పాషిగామ, ముత్తునూర్, రాంనూర్, చెగ్యాం, జగదేవ్‌పేట గ్రామాలలో శ్రీ సీతారాములు కల్యాణం నిర్వహించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, టెంట్లు వేసి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సామాజిక న్యాయం కోసం జగ్జీవన్‌రామ్ కృషి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జయంతి వేడుకల్లో పాల్గొన్న విప్ లక్ష్మణ్‌కుమార్, అధికారులు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కోసం బాబు జగ్జీవన్ రామ్ కృషి చేశారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. భారత ఉప ప్రధానిగా దేశానికి సేవలందించారని కొనియాడారు. జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ళ బావి వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా స్వాతంత్ర్య అనంతరం భారత దేశ నిర్మాణంలో సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బిఎస్ లత, ఆర్డీఓ మదుసూదన్, షెడ్యూలు కులాల అబివృద్ధి అధికారి రాజ్‌కుమార్, డీఎస్పీ రఘు చందర్, మున్సిపల్ కమీషనర్ స్పందన, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ కన్వీనర్‌లు నక్క విజయ్, బంగారు దీపక్, మకిలి ఇబ్రాయిల్, మాజీ మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

● జగిత్యాల పట్టణంలోని జీవన్‌రెడ్డి గృహం ఇందిరాభవన్‌లో జరిగిన కార్యాక్రమంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తదితరులు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ తనకు అప్పగించిన ప్రతి పదవికి న్యాయం చేశారని అన్నారు. జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏడాదిలోగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ విజయలక్ష్మి, బండ శంకర్, నక్క జీవన్, గాజుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన గోగూరి యమునలక్ష్మారెడ్డి 25,116 రూపాయలు, పూడూర్ గ్రామానికి చెందిన బండ రజిత మనోహర్‌రెడ్డి 10,116 రూపాయలను శనివారం ఆలయ నిర్మాణ కమిటీ వారికి విరాళంగా అందించినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ వారు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంజనేయ స్వామికి పాదుకల సమర్పణ

రాయికల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావన్‌పెల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి మాలావత్ వెంకటేష్ దంపతులు రజత పాదుకలను సమర్పించారు. పురోహితుడు చెరుకు మహేశ్వర శర్మ ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గోవిందుల శ్రీనివాస్, కట్కాపూర్, దావన్‌పెల్లి గ్రామాల మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం

పెగడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం విమర్శించారు. పెగడపల్లి మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుండి పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ప్రతి రేషన్ దుకాణంలో ప్రధాని ఫొటో పెట్టాలని బీజేపీ సూచిస్తే నిజం ప్రజలకు తెలిస్తే ఎక్కడ ఓట్లు కోల్పోతామోనని కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రధాని ఫొటో పెట్టకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతున్నందున ముఖ్యమంత్రి ఫొటో పెట్టాలని కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలను పక్కదారి పట్టించడానికే తెలంగాణా రాష్ట్రం చెల్లించే పన్నులతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తుందని అవాకులు, చవాకులు మాట్లాడుతున్నరని విమర్శించారు. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన వడ్లకు కేంద్ర ప్రభుత్వం డబ్బులు చెల్లించినపుడు బియ్యం కేంద్రానివి కావా అని ఆయన ప్రశ్నించారు. పేద ప్రజలకు ఇస్తున్న ఆరు కిలోల బియ్యంలో ఒక్క కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని ఆయన అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వమే రేషన్‌బియ్యం ఇస్తున్నామనడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు పల్లె మోహన్ రెడ్డి , నాయకులు గంగుల కొమురెల్లి, గట్టయ్య, రాజు, హరీష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

రాయికల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని భూతిపూర్ గ్రామానికి చెందిన రామస్వామి తల్లి అనారోగ్యంతో మరణించగా 2002-03 బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా కలిసి విరాళాలు సేకరించి శనివారం రూ.32వేలను రామస్వామికి అందించారు. కార్యక్రమంలో సోమ రమేష్‌రెడ్డి, ఎల్లాల చంద్రశేఖర్ రెడ్డి, కటుకం రజిత్ కుమార్ పాల్గొన్నారు.

'పేదలకు వరం సీఎం రిలీఫ్‌ఫండ్'

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు కోరుట్ల నియోజకవర్గంలో 3 కోట్ల విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. శనివారం పట్టణంలోని జువ్వాడి భవన్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మెట్‌పల్లి పట్టణంలో ఆరుగురికి, మండలానికి చెందిన 21 మంది లబ్ధిదారులకు 8 లక్షల 74 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కంటే అత్యధికంగా నిధులు కేటాయించి పేదలకు చెక్కులను అందిస్తు అండగా ఉంటోందన్నారు. పేద ప్రజల ఆరోగ్యానికి అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మెట్‌పల్లి బ్లాక్ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు నాయిని సురేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు మార్గం గంగాధర్, శ్రీనివాస్‌రావు, జంగస్వామి, జాజాల రాజ్‌కుమార్, పూదరి నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయికల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరులో గల ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య జలాధివాసం, ధాన్యాధివాసం, వస్త్రాధివాసం, పుష్పాధివాసం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యంత్ర ప్రతిష్ఠ చేసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్ గౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ ఓరుగంటి భూమారావు, అర్చకులు శ్రీనివాస్, గ్రామ నాయకులు కొత్త వెంకటి, అనుపురం గంగాధర్, ముద్దం రమేష్, మక్కల సాయి కుమార్, అల్లాల రంజిత్, రమణయ్య, అనుపురం సత్యం తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి మార్కెట్ చైర్మన్‌గా రాములుగౌడ్



పెగడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నంచర్ల గ్రామానికి చెందిన బుర్ర రాములు గౌడ్‌ను నియమిస్తూ మార్కెటింగ్ శాఖ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా బుర్ర రాములు గౌడ్, వైస్ చైర్మన్‌గా సురకంటి సత్తిరెడ్డి మద్దులపల్లి, డైరక్టర్లుగా అడుప తిరుపతి, అజ్మీర అంజన్న నాయక్, లింగంపల్లి మహేష్, సంకిటి శ్రీకాంత్‌రెడ్డి, చాట్ల విజయ భాస్కర్, తవుటు లావణ్య, దేశెట్టి లక్ష్మిరాజం, శ్రీరాం అంజయ్య, బాలుసాని శ్రీని వాస్, మన్నె గంగారాజం, మ్యాకల మల్లయ్య, చెట్ల కిషన్, పెగడపల్లి గ్రామ పత్యేకాధికారి, నందగిరి సింగిల్ విండో చైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సేంద్రియ సాగు శిక్షణకు ఇటిక్యాల రైతు



శాస్త్రవేత్తతో రైతు రాజేందర్‌రెడ్డి

రాయికల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో జరుగుతున్న సేంద్రియ సాగు శిక్షణకు రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికిచెందిన రైతు గడ్డం రాజేందర్ రెడ్డిని ఎంపిక చేయగా మౌంట్ అబులో శిక్షణ పొందుతున్నాడు. ఈసందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సేంద్రియ సాగులో మెళకువలు నేర్పిస్తున్నారని తెలిపాడు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

అందని బిల్లులు...ఆగిన పనులు

- ఏళ్లుగా ముందుకు సాగని నిర్మాణ పనులు

గంగాధర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధి పనులు అధికారుల నిర్లక్ష్యంగా ఏళ్లుగా ముందుకు సాగడంలేదు. చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు వదిలేయడంతో అసంపూర్తిగా ఉన్న భవనాలు దర్శనమిస్తున్నాయి. గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో పాఠశాల భవనానికి గత ప్రభుత్వం మూడు లక్షల రూపా యలు మంజూరు చేసింది. స్లాబు పూర్తి చేసి లోపల ఒక వైపు గో డలు, ఫ్లోరింగ్ పనులు పూర్త య్యాయి. 2.65 లక్షల బిల్లు మంజూరైంది. మిగతా బిల్లులు రాకపోవ డంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశాడు. ప్రహరీ, లోపల గోడలు నిర్మించాలి. మిగులు పనులకు 2.25 లక్షలు మంజూరైనట్లు సమాచారం. పాఠశాల పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుండైనా వినియోగంలోకి తీసుకు రావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



లక్ష్మీదేవిపల్లిలో పాఠశాల భవనం

● అద్దె భవనంలో పల్లె దవాఖాన

మండలంలోని కురిక్యాల పల్లె దవాఖాన అద్దె భవనంలో అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. సొంతభవన నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం 21 లక్షల నిధులు మంజూరయ్యాయి. స్లాబు వేసిన కాంట్రాక్టర్ బిల్లులు రాక మధ్యలో వదిలేశాడు.



కురిక్యాలలో అసంపూర్తిగా ఉన్న పల్లె దవాఖాన భవనం

- ఇదే గ్రామంలోని పాఠశాలకు మన ఊరు మనబడి పథకం కింద 14 లక్షల రూపాయలు మంజూరయ్యాయి.ది. ఈ నిధులతో కిచెన్ షెడ్డు, టాయిలెట్లు నిర్మించాలని నిర్ణయించారు. నిధులు సరిపోక కిచెన్‌కు పిల్లర్లు వేసి వదిలేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులకు నిధులు విడుదల చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నంబర్‌ప్లేట్ లేని 14 బైక్‌లు సీజ్



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై రవి

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నంలో నంబర్‌ప్లేట్ లేని వాహనాలు, మైనర్‌డ్రైవింగ్‌పై పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా నంబర్‌ప్లేట్ లేని 14ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించి సీజ్‌చేసినట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



సంపత్ కుమార్

జమ్మికుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్‌పరిధిలోని పాత వ్యవసాయ మార్కెట్ ప్రాంతానికిచెందిన భూపతి సంపత్ కుమార్ కనపడటం లేదని అతడి భార్య హేమ ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపినవివరాల ప్రకారం.. సంపత్ కుమార్ పదిసంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాడు. తరుచూ ఇంట్లో ఆర్థిక పరిస్థితి చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈనెల 5న ఉదయం 10.30గంటల ప్రాంతంలో ఇంట్లో నుండి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంతవెతికినా ఫలితం లేకుండా పోయింది. ఫోన్‌కూడా స్విచ్ఛాఫ్ రావడంతో సంపత్‌కుమార్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ధర్మపురి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ధర్మపురి పోలీసులు శనివారం కనుగొన్నారు. నదిలోగల బండరాళ్ల కింద మృతదేహం కుళ్లిపోయి ఉంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గంజాయి పట్టివేత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని టీఆర్ నగర్ కాలనీకి చెందిన షేక్‌నజీర్ అనేవ్యక్తి నుంచి 131గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. జగిత్యాల మండలం ధరూర్‌శివారులో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా నజీర్ అనే వ్యక్తి వద్ద గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని నజీర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మానవాళికి శ్రీరాముడి జీవితం ఆదర్శం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మానవాళికి శ్రీరాముని జీవితం ఆదర్శమని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మల సత్యం అన్నారు. విశ్వహిందూ పరిషత్ గోదావరిఖని శాఖ ఆధ్వర్యంలో శనివారం కోదండ రామాలయంలో జరిగిన శ్రీరామోత్సవంలో ఆయన ప్రసంగించారు. యువత సన్మార్గంలో నడవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ శ్రీరాముని అడుగుజాడల్లో నడవాలన్నారు. నేటి యువతరం శ్రీరామ రాజ్యాన్ని నిర్మించాలని నాదేశం-నాధర్మం అనే నినాదంతో యువతీ యువకులు ముందుకు సాగాలన్నారు. సమాజంలో మాతృమూర్తుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, గోరక్ష ప్రముఖ్ ఇసంపెల్లి వెంకన్న, జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం, నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్, కొండపర్తి లింగన్న, మునిగాల సంపత్, అడిగొప్పుల రాజు, ములుకుంట్ల శ్రీనివాస్, పిన్నింటి శ్రీనివాస్, పారిపల్లి చక్రపాణి, అరవింద్, కోట తిరుమల, సూర్యదేవర జ్యోతి, లలితమ్మ, స్వప్న, మమత, స్వరూప, పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన రాగుల శ్రీనివాసచారి కరీంనగర్ నుంచి తాడికల్ వస్తున్నాడు. తాడికల్ గ్రామశివారులోని రైస్‌మిల్లుల వద్ద ఒడిస్సాకు చెందిన డీబీఎల్ కంపెనీలో పనిచేసే కృష్ణ ఎదురెదురుగా రావడంతో రెండుబైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీనివాసచారికి, కృష్ణకు గాయాలు కావడంతో స్థానికులు 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలి



ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. మృతిచెందిన యువకుడి ఫొటోను సీసీ ఫుటేజి ఆధారంగా శనివారం టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ విడుదల చేశారు. పోలీసుల వద్ద ఉన్న సమాచారం మేరకు మృతిచెందిన వ్యక్తి రాకేష్ అయి ఉంటాడని భావిస్తున్నామని హుజూరాబాద్ ప్రాంతానికి ఎందుకు వచ్చాడో తెలియడం లేదన్నారు. ఫోటోలో ఉన్న వ్యక్తిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సమాజంలో న్యాయవాద వృత్తి మహోన్నతమైనది



మానవ హక్కుల కమిషన్ మాజీచైర్మన్ జస్టిస్ చంద్రయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జడ్జి దుర్గేష్

సుల్తానాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సమాజంతో ఉత్పన్నమయ్యే అనేక సమస్యలకు పరిష్కారాన్ని చూపించే న్యాయవాద వృత్తి మహోన్నతమైనదని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. శనివారం సుల్తానాబాద్ కోర్టును సందర్శించిన ఆయన బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను సమాజంలో అమలుపరచని సందర్భాలలో వాటిని సవ్యమైన మార్గంలో నడిపించేందుకు న్యాయవాదులు సేవ చేయాలని అన్నారు. న్యాయవాదులకు చట్టాలు, రాజ్యాంగ హక్కులు పట్ల అవగాహన కల్పించారు. కాగా జస్టిస్ చంద్రయ్యకు సుల్తానాబాద్ కోర్టు జడ్జి దుర్గం గణేష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి సన్మానించారు. బార్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి,న్యాయవాదులు కలసి జస్టిస్ చంద్రయ్య ను ఘనంగా సన్మానించారు. బార్ ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, సీనియర్ న్యాయవాదులు ఆవుల లక్ష్మీరాజంయాదవ్, పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, బాలకిషన్ ప్రసాద్,మాదూరి అంజనేయులు, జోగుల రమేష్, సామల రాజేంద్ర ప్రసాద్, ఆవుల శివకృష్ణ, గుడ్ల వెంకటేశ్, బిబ్బిలి శ్యామ్, కరుణాకర్, లెక్కల గంగాధర్, తిరుపతి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

వంగిన విద్యుత్ స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బొంకూరు గ్రామంలో విద్యుత్‌స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. పలు వీధుల్లో విద్యుత్‌స్తంభాలు పూర్తిగా ఇళ్లపైకి ఒరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులు వస్తే ఇంటిపై స్తంభంకూలితే భారీప్రమాదం చోటు చేసుకుం టుందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలోని ఇళ్లపై ఒరిగిన విద్యుత్‌స్తంభాలను సరిచేసి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పెద్దబొంకూరులో ఇళ్లపైకి ఒరిగిన విద్యుత్ స్తంభం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఆము దాలపల్లి శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్య దర్శి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని కన్నాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ విధులు ముగించుకొని స్వగ్రామమైన జమ్మికుంటకు ద్విచక్ర వాహ నంపై వెళ్తున్నాడు. ఆముదాలపల్లి శివారులోని సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై పడి పోయి ఉండగా, అటుగా వెళ్తున్న రైతులు గమనించి రోడ్డు పక్కకు తీసుకెళ్లి 108కుసమాచారం అందించారు. చికిత్సనిమిత్తం 108లో ఆస్పత్రికి తరలిం చారు. కాగా ఈప్రమాదానికి సంబంధించి పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

స్వాతంత్ర్య సమరయోధుడు కాంతారావుకు కన్నీటి వీడ్కోలు



పాడె మోస్తున్న సీపీఐ నాయకులు

ఎలిగేడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు తెలంగాణ సాయుధపోరాటవీరుడు(సీపీఐ) సుల్తాన్‌పూర్ మాజీసర్పంచ్ తానిపర్తి కాంతారావుకు ప్రజలు, నాయకులు కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం ఆయన మృతిచెందగా శనివారం సుల్తాన్‌పూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అధికారులు, ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నిజాంకు వ్యతిరేకంగా జరిగినఉద్యమంలో చురుకుగా పాల్గొన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. 30ఏళ్లపాటు సర్పంచ్‌గాపనిచేసి ప్రజలకు విశేషసేవలు అందించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్‌డివో గంగయ్య, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐశేఖర్‌లు కాంతారావు పార్థివా దేహంపై జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. సీపీఐ కార్యదర్శులు తాండ్రసదానందం, మద్రివెంకటస్వామి అంత్యక్రియల్లో పాల్గొని ఎర్ర జెండాను కప్పారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడేమోశారు. మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

● నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

మహాముత్తారం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పడంతో నలుగురికి గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా గోదవరిఖనికి చెందిన బోగిరి విజయ్‌కుమార్, ఎం అశోక్, శేఖర్, రాంరెడ్డి మహాముత్తారం మండలం మీదుగా ములుగు జిల్లా మేడారం వెళ్తుండగా యామన్‌పల్లి సమీపంలో ఈ ఘటన జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో కారు ధ్వంసమై నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరు స్వల్పంగానూ, ముగ్గురు తీవ్రంగానూ గాయపడినట్టు తెలిసింది. క్షతగాత్రులను 108 సిబ్బంది భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర కుమార్ తెలిపారు.

మట్టి కుండ పోయి ప్లాస్టిక్ బిందె వచ్చె!

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కల్లు గీసి నిల్వ చేయడం కోసం గతంలో గీత కార్మికులు లొట్టిలు(కుండలు) వినియోగించేవారు. కులవృత్తులకు ఆదరణ తగ్గడంతో కుమ్మరులు కుండలు చేయడం మానేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కుండలు అందుబాటులో లభించకపోవడం, కోతుల బెడద అధికమవడంతో ఈత చెట్ల నుంచి కల్లు తీసేందుకు గీత కార్మికులు లొట్టిల(కుండలు)కు బదులు ప్లాస్టిక్ బిందెలను వాడుతున్నారు. ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని ఈత చెట్లకు ఇలా ప్లాస్టిక్ బిందెలను కట్టి కల్లును సేకరిస్తున్నారు. ప్లాస్టిక్ బిందెలు వాడడం వల్ల కోతులు అటు ఇటు తీసేసిన కింద పడి పగిలిపోకుండా ఉంటుందని గీత కార్మికులు పేర్కొంటున్నారు.



ఈత చెట్లకు కట్టిన ప్లాస్టిక్ బిందెలు

ప్రజా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ/రామగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న హైద్రాబాద్‌లో నిర్వహించనున్న ప్రజాధర్నా పోస్టర్లను శనివారం యైటింక్లయిన్‌కాలనీ, రామగిరి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ ఐఎఫ్‌టీయూ ఆఫీస్‌లలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆవిష్కరించారు. డివిజన్ కార్యదర్శి బీ అశోక్ మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట హత్యాకాండను సృష్టిస్తున్నాయన్నారు. వందలాది మందిని ఎన్‌కౌంటర్ల పేరిట బలి తీసుకుంటున్నారని, అడవుల్లోని అపార ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే కగార్ పేరిట హత్యాకాండ సాగిస్తున్నాయని అశోక్ పేర్కొన్నారు. మేధావులు, విద్యార్థి యువజన సంఘాలు కేంద్ర వైఖరిని ఖండించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈనెల 8న హైద్రాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ప్రజాదర్బార్‌కు కార్మికులు, ప్రజలు తరలిరావాలని అశోక్ పిలుపునిచ్చారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మధ్య మానేరు నిర్వాసితులను..
గుండెల్లో పెట్టుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమే

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రవరంలో ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరు నిర్వాసితులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, అనుపురం, చింతలఠాణ, చీర్లవంచ, కొడుముంజ, శాభాష్‌పల్లి, గుర్రంవానిపల్లి గ్రామాల ప్రజలకు ఉపాధిహామీ పథకాన్ని రుద్రవరంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ మండలంలోని నిర్వాసితుల సమస్యలు దగ్గరుండి చూశానని, వారిత్యాగం మరువలేనిదన్నారు. నిర్వాసితులకు ఉపాధికల్పనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నానని గుర్తుచేశారు. 9గ్రామాల్లో 3500 మంది ఉపాధిహామీ నిర్వాసిత కూలీలకు 100 రోజులు పని కల్పిస్తున్నామన్నారు. ఒక్క రోజు పనికి రూ.300పైచిలుకు చెల్లిస్తున్నామని, జాబ్‌కార్డు లేని వారికి జాబ్ కార్డులు అందించి పని కల్పిస్తామన్నారు. ఉపాధిహామీ పనికి వెళ్లడం ద్వారా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికికూడా అర్హులు అవుతారని సూచించారు. ప్రజలందరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుద్రవరం గ్రామానికి నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైసింగ్ తెలంగాణగా ముందుకుపోతుందన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో మల్హోత్ర, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, చింతపల్లి శ్రీనివాస్‌రావు, ఎర్రం రాజు, గాలిపెల్లి స్వామి ఉన్నారు.

ఆలయాలు మానవతా వికాస కేంద్రాలు



మాట్లాడుతున్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు మానవతా వికాసకేంద్రాలుగా విలసిల్లుతున్నాయని, ప్రజలకు సేవలందించే విధంగా మనపూర్వీకులు ఆలయాలను రూపొందించారని జాతీయ సాహిత్యపరిషత్ పూర్వ జాతీయఅధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జాతీయ సాహిత్యపరిషత్ కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం కొత్తపల్లి చిన్నగుట్టపై స్వయంభూ వేంకటేశ్వరాలయంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడారు. దేవాలయాలు ఆధ్యాత్మికతతోపాటు అన్న సత్రాలుగా, అనాథాశ్రమాలుగా, ధర్మ సత్రాలుగా, విద్యా, వైద్య, వేద, కళా, సాంస్కృతిక కేంద్రాలుగా వర్ధిలిల్లుతున్నాయన్నారు. పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, ప్రజ్ఞాభారతి చైర్మన్ డాక్టర్ లెక్కల రాజభాస్కర రెడ్డి, పరిషత్‌తెలంగాణ అధ్యక్షుడు వద్దూరి ఆంజనేయరాజు, నరహరి నారాయణరెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, కొత్తపల్లి మాజీ సర్పంచ్ వాసాల రమేశ్, సంస్థ ప్రధానకార్యదర్శి నంది శ్రీనివాస్, డాక్టర్ కలువకుంట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న రచయిత్రులు

నేడే రామయ్య కల్యాణమహోత్సవం

• హాజరుకానున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న సన్నిధిలో రామయ్య దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించేందుకు ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్న ఆలయంలో నిర్వహించే శ్రీసీతారామచంద్రుల కల్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వేములవాడకు తరలిరానున్నట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం ఉదయం 11.55 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీస్వామివారి కల్యాణతంతు నిర్వహించనున్నారు. సాయంత్రి 5 గంటలకు శ్రీస్వామివారి రథోత్సవం, రాత్రి 7.30 గంటలకు డోలోత్సవము ఘనంగా నిర్వహించనున్నారు. రాజన్న ఆలయానికి సుమారుగా 50 వేల వరకు భక్తులు తరలి రానున్నారని, దానికి అనుగుణంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలె త్తకుండా ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో సీఐ వీరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాజన్న ఆలయంలోని ఈవో కార్యాలయం ముందు ప్రత్యేక కల్యాణ మండపం పైన శ్రీస్వామి వారి కల్యాణాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాములోరి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు బారీకేడ్స్‌తో గ్యాలరీలను ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బంది, ఆలయ ఉద్యోగులు, సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం నిర్వహించే శ్రీసీతారామచంద్రుల కల్యాణ మహోత్సవానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.



కల్యాణానికి ఏర్పాటు చేసిన బారీకేడ్లు



కల్యాణవేదిక ఏర్పాట్లు

● భక్తులు ఇబ్బందులు లేకుండా చర్యలు..

శ్రీసీతారాముల కల్యాణాన్ని వేములవాడ రాజన్న ఆలయంలో అంగరంగ వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. రాజన్న ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, భక్తులను దృష్టిలో పెట్టుకుని భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భక్తులకు ఉచిత భోజన వసతిని, వేసవి కాలం కావడంతో చల్లని తాగునీరు. మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ధర్మపురి నుంచి పట్టువస్త్రాలు.. తలంబ్రాలు



ధర్మపురి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న ఆలయ ఈవో, ధర్మకర్తలు

ఇల్లందకుంట/ధర్మపురి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయానికి ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ పట్టువస్త్రాలు.. ముత్యాల తలంబ్రాలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈఏడాది కూడా స్వామివారి కల్యాణం సందర్భంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశామన్నారు. అనంతరం ఆయనను స్థానిక ఈవో, ఆలయ అర్చకులు శాలువాతో సన్మానించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, ధర్మపురి ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హాకీ పోలీస్ మీట్‌కు ఎంపిక



వినీత్

హుజూరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన మోటపోతుల వినీత్ ఈ నెల7 నుంచి 14 వరకు ఒడిషాలోని భువనేశ్వర్‌లో జరిగే 73వ ఆల్ ఇండియా హాకీ పోలీస్‌మీట్‌కు ఎంపికయ్యాడు. వినీత్ హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో సిటీ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వినీత్ ఎంపికపై హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, శంకర్, ఉమామహేశ్వర్, సజ్జు, యూసుఫ్, రమేష్, తిరుపతి హర్షం వ్యక్తం చేశారు.

రాజన్న ఆలయంలో కొనసాగుతున్న వేడుకలు

• ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు
• రాజన్న సేవలో పలువురు ప్రముఖులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీరామనవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం రాజన్న ఆలయంలో స్వామి వారితో పాటుగా శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీఅనంతపద్మనాభస్వామి అనుబంధ పరివార దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వార్లకు భక్తోత్సవము, హవనములు కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు.

● దర్శించుకున్న ప్రముఖులు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు సిద్దిపేట జిల్లా జడ్జి సాయిరమాదేవి, ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ కే. జ్యోతి వేములవాడకు వచ్చారు. రాజన్న ఆలయానికి వీచ్చేసిన వారికి ఆలయ అర్చకులు స్వస్తి వేదోక్త స్వాగతం పలికారు. శ్రీరాజరాజేశ్వర స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వెంట ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, శ్రీకాంచారి, రాజేందర్ తదితరులు ఉన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

● రాజన్న గోశాల, అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు, అన్నదాన ట్రస్ట్‌కు హైద్రాబాద్ నగరానికి చెందిన మదికంటి సృజన్ - స్వాతి దంపతులు విరాళం ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి అందజేశారు. రాజన్న ఆలయ గోశాలకు రూ. ఒక లక్ష, అన్నదాన ట్రస్ట్‌కు రూ.1.50 లక్షలు, శ్రీస్వామివారికి రూ.63 వేలు 638 విరాళంగా చెక్కు రూపంలో అందించారు. వారి వెంట ఆలయ అకౌంటెంట్ ఆగంరావు ఉన్నారు.

వేములవాడలో సందడి

● కల్యాణానికి తరలివచ్చిన భక్తులు



రాజన్న ఆలయం వద్ద ఆటపాటలు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలో ఆదివారం నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి వేములవాడకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి రాజన్న ఆలయానికి భక్తుల రాక ఒక్కసారిగా పెరిగింది. రాత్రి 7 గంటల వరకు రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటుగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీసీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని రాజన్న ఆలయానికి జోగినీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయం ముందు జోగినీలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేయడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారియి. భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో జడల రమేష్ ఏర్పాటు చేసిన భక్తి సంగీతం ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పలు విభాగాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కల్యాణం ఏర్పాట్లను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు.



ఆలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు, జోగినులు

రాజన్న ఆలయ అన్నదాన ట్రస్టుకు విరాళం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజ్వేశ్వర స్వామివారి అన్నదాన ట్రస్ట్‌కు వేములవాడ మండలం చింతలఠాణ గ్రామానికి చెందిన నిమిశకవి శ్రీకాంత్ స్రవంతి దంపతులు విరాళం అందజేశారు. శనివారం కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకున్న అనంతరం అన్నదాన ట్రస్టుకు రూ. లక్ష, 41 వేయి 116లు ఏఈవో జయకుమారికి అందజేశారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న అర్చకుడు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద శనివారం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు హన్మంతు గౌడ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు హోమాలు, చండీయాగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో నిత్య పూజలను నిర్వహిస్తామన్నారు. శనివారం చండీయాగాన్ని నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ కార్యవర్గ సభ్యులు మోడెం సురేందర్, బాలసాని స్వామిగౌడ్, వంగ శ్రీనివాస్, పొన్నం అంజయ్య, జనార్ధన్(లడ్డు), కోడూరి రవి, మేరుగు యాదగిరిగౌడ్, అశోక్, సాయిలీల సురేష్, రాయమల్లుగౌడ్ పాల్గొన్నారు.

బంగారం తరలింపు వ్యవహారంలో ఇద్దరి అరెస్టు

● మరో ఇద్దరి కోసం గాలింపు ● వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐ వీరప్రసాద్

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సౌదీ అరేబియా నుంచి తీసుకువచ్చిన బంగారాన్ని మాయం చేసిన ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన రుద్ర రాంప్రసాద్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో ఉన్న తన సమీప బంధువు రవీందర్ ద్వారా 400 గ్రాముల బంగారాన్ని తెప్పించుకునేందుకు 35 లక్షల రూపాయలు పంపించాడు. దీంతో రవీందర్ బంగారం ఇండియాకు పంపించే ప్రయత్నాలలో భాగంగా వేములవాడకు చెందిన కాల్వ వెంకటేష్ అనే వ్యక్తి ద్వారా చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన తొంటి బీరయ్య, గడ్డం అనిల్ ఇండియా వెళుతున్నారని తెలుసుకొని వీరి ద్వారా 400 గ్రాముల బంగారం పంపించాడు. సౌదీ నుంచి బయలుదేరుతున్న సమయంలో తాము పెద్ద మొత్తంలో బంగారం ఇండియాకు తీసుకువస్తున్న విషయాన్ని తమ సమీప బంధువు ఏనుగుల నాగరాజుకు సమాచారం ఇవ్వడంతో ఈ మొత్తం బంగారాన్ని కాజేయాలని పథకం పన్నారు. హైదరాబాదులోని విమానాశ్రయంలో దిగిన వెంటనే అక్కడకు చేరుకున్న నాగరాజుకు బంగారం ఇవ్వడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడని ఏఎస్పీ వివరించారు. సౌదీ నుంచి తీసుకువచ్చిన బంగారాన్ని రాంప్రసాద్‌కు అప్పగించాల్సిన బీరయ్య, అనిల్ అందుకు బదులుగా నాగరాజుకు అప్పగించిన విషయం తెలుసుకున్న రాంప్రసాద్ తాను మోసపోయినట్లు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఈ సంఘటనలో బీరయ్య, అనిల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, కాల్వ వెంకటేష్, ఏనుగుల నాగరాజు పరారీలో ఉన్నారని ఆమె వివరించారు. పరారీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ఇద్దరు ఎస్ఐలతో కూడిన ఆరుగురు సభ్యుల బృందాన్ని ఏర్పాటుచేసి గాలింపు చేపట్టామని, విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారుల కన్ను కప్పి పెద్ద మొత్తంలో బంగారం తీసుకువచ్చిన వ్యవహారం వెనుక ఎవరున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే మిగిలిన నిందితులను పట్టుకుని బంగారం స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణ సీఐ వీరప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బాలుడి వీరంగం

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌లో ఓ బాలుడు వీరంగం సృష్టించాడు. మత్తు పదార్థాలకు అలవాటు పడి శనివారం ఇంట్లో ఉన్న తన సోదరిని చితకబాదగా మందలించిన తల్లిపై బండరాయితో దాడి చేసేందుకు యత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. స్థానికులు ఆ బాలుడిని ఇంట్లో బంధించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకొని 100 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

కొండగట్టులో భక్తుల సందడి



కొండగట్టులో ఆలయం వద్ద భక్తులు



జయంతి కోసం కొండగట్టులో ఏర్పాటు చేసిన బారీకేడ్లు

మల్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేకువజాము నుంచే వేలాదిగా వచ్చిన భక్తులు, దీక్షాపరులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు, సత్యనారాయణ వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

● నేడు శ్రీరామనవమి వేడుకలు

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించడానికి దేవస్థానం తరపున ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక వేదికపై రాములోరి కల్యాణం వేడుకగా జరుపనున్నారు.

చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

కొండగట్టులో జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సగానికి పైగా పొడగాటి కర్రలతో బారికేడ్లు, క్యూలైన్‌లు ఏర్పాటు చేయగా ఈసారి ఇనుప వాటితో ఆలయం ముందు, వెనుకాల ఏర్పాటు చేశారు. మరిన్నింటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ సారి పోలీస్ అవుట్‌పోస్టు నుంచి కోనేరు వరకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు.

వైభవంగా కుంకుమ పూజలు

పెగడపల్లి, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని నామాపూర్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకములు, ప్రధాన కలశస్థాపన నిర్వహించి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నామాపూర్‌లోని రామాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఎన్టీపీసీ రిటైర్డు ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ పథకం అమలు



ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్) సిక్దర్‌ను అభినందిస్తున్న మాజీ ఉద్యోగులు

జ్యోతినగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ రిటైర్డు ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ పథకం అమలుకు మార్గం సుగమమైంది. గతంలో ఉన్న ఈపీఎస్-95 కింద కనిష్ఠ స్థాయిలో పెన్షన్ పొందిన రిటైర్డ్ ఉద్యోగులు ఇకముందు నిజవేతనాలపై(హయ్యర్ వేజెస్) ఈపీఎస్ 95 స్కీం కింద గరిష్ఠంగా పెన్షన్ పొందనున్నారు. రామగుండం ఎన్టీపీసీ మానవ వనరుల(హెచ్‌ఆర్) విభాగం అధికారులు చొరవతో కొత్త పెన్షన్ పథకానికి మోక్షం లభించింది. హయ్యర్ వేజెస్‌పై పెన్షన్ ఇవ్వాలని ఎన్టీపీసీ మాజీ ఉద్యోగులు న్యాయం పోరాటం చేశారు. గతంలో సుప్రీంకోర్టు నిజవేతనాలపై ఈపీఎస్ 95 పెన్షన్ స్కీంను రిటైర్డు ఉద్యోగులకు అమలు చేయాలని తీర్పు ఇచ్చింది. 01-09-2014 తరువాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఈ పథకం అమలు చేయాల్సి ఉంటుంది. రామగుండం ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులు కరీంనగర్‌లోని పీఎఫ్(ఈపీఎఫ్‌వో) అధికారులతో ఈపీఎస్ 95పై సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో సుమారు 398 మంది రిటైర్డు ఉద్యోగులకు కొత్త పెన్షన్ స్కీం అమలు కానుంది. మెరుగైన పెన్షన్ అమలయ్యేలా కృషి చేసిన హెచ్‌ఆర్ ఏజీఎం(హెచ్‌వోడీ) విజయ్ కుమార్ సిక్దర్, అధికారులను ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అభినందించారు. హయ్యర్ వేజెస్‌పై ఈపీఎస్ 95 పెన్షన్ స్కీం అమలుకు కృషి చేసిన ఎన్టీపీసీ మానవ వనరుల అధికారులను రామగుండం ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం సంఘం అధ్యక్షుడు ఎ.రాంకిషన్, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సన్నద్ధం కావాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగించనున్నామని, కార్మికులందరూ సన్నద్ధం కావాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం చర్యలతో ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సోమవారం లేబర్ కమిషన్ కార్యాలయంలో సమ్మె తేదీని ప్రకటించనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు, కొత్త నియామకాలు లేవన్నారు. ఉద్యోగుల పీఎఫ్ ట్రస్టులో ఉన్న డబ్బులను యాజమాన్యం వాడుకుందన్నారు. దీంతో ఉద్యోగులు పీఎఫ్ డబ్బులు తీసుకునే వీలు లేకుండా పోయిందన్నారు. గత సర్కార్ ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో విలీనం అంశం ఉందని, ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. మహాలక్ష్మి పథకానికి తాము వ్యతిరేకం కాదని, ఆడబిడ్డలకు అండగా ఆర్టీసీ ఉద్యోగులు ఉంటారని, దానికనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈవీ బస్సులను తీసుకు వచ్చి డిపోలన్నింటినీ ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికే కొన్ని డిపోలను ప్రైవేట్ పరం చేశారన్నారు. కేంద్రం ఎలక్ట్రిక్ బస్సులపై ఇస్తున్న సబ్సిడీని ప్రైవేట్ సంస్థలకు కాకుండా ఆర్టీసీకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్‌లు లేవని యాజమాన్యం ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. సమావేశంలో ఈబీ రావు, అంజిరెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి థామస్‌రెడ్డి

దళితబంధు నిధులు విడుదల చేయాలని ఆందోళన



కథలాపూర్‌లో సాధన సమితి సభ్యుల నిరసన

కథలాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు కింద ఎంపికైన వారికి రెండో విడత నిధులు విడుదల చేయాలని శనివారం కథలాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సాధన సమితి సభ్యులు ఆందోళన చేశారు. కలెక్టర్ల అకౌంట్లలో దళితబంధు నిధులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎంపిక చేసిన వారికి లబ్ధి చేకూర్చడం లేదని ఆరోపించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాధన సమితి అధ్యక్షుడు తీట్ల శంకర్, తరి రవి, తరి రమేశ్ తదితరులు ఉన్నారు.

పశుగణన కోసం ఇంటింటా సర్వే

దివ్యశ్రీ, పశువైద్యాధికారి, కథలాపూర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలో పశు గణన సర్వే నిర్వహిస్తు న్నారా?

పశు వైద్యాధికారి: ప్రతీ ఐదేళ్లకోసారి పశు గణన చేస్తాం. దీని కోసం మూడు నెలలుగా ప్రత్యేకంగా నియమించిన అధికారులతో ఇంటింటా గణన కొనసాగుతోంది.

ఆంధ్రజ్యోతి: పశువులకు టీకాలు వేస్తున్నారా?

పశు వైద్యాధికారి: గొర్రెలు, గేదెలు, ఆవులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా క్రమం తప్పకుండా టీకాలు వేస్తున్నాం. కథలాపూర్ ప్రాథమిక వైద్యశాల పరిధిలో ఉన్న 9 గ్రామాల్లో యేటా లక్ష్యాలను పూర్తి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వైద్య సిబ్బంది కొరత ఉందా?

పశు వైద్యాధికారి: సిరికొండ సబ్ సెంటర్‌లో ఆఫీస్ సబార్డినేట్ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం రైతులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నాం. పశు బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

-కథలాపూర్

రాజ్యాంగ పరిరక్షణకు కృషి

కథలాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : దేశంలో బీజేపీ మనువాద సంస్కృతితో రాజ్యాంగానికి రోజురోజుకూ విలువ లేకుండా చేస్తున్న తరుణంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ కంకణం కట్టుకుందని పీసీసీ తరపున వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల కోఆర్డినేటర్ అవేజ్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య పేర్కొన్నారు. మండలంలోని తుర్తి నుంచి అంబారిపేట దాకా జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించిన అనంతరం మాట్లాడారు. రాజ్యాంగం అన్ని కులాలు, మతాలు ఒక్కటే అని స్పష్టం చేస్తుంటే బీజేపీ కులాలు, మతాల పేరిట విభజిస్తూ పాలించే కుట్రలు చేస్తోందన్నారు. చట్టాలను కాలరాస్తూ నిబంధనలకు వ్యతిరేకంగా మార్పులు చేసి రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జవ్వాజి రవి, ఎగ్యారపు శ్రీహరి ఉన్నారు.

వీర హనుమాన్ విజయ యాత్ర

మల్లాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : భజరంగ్ దళ్ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంన మండల కేంద్రంలో శనివారం వీర హనుమాన్ విజయ యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాపూర్ ప్రధాన వీధులన్నీ కాషాయమయమయ్యాయి. జై శ్రీరామ్...అంటూ హనుమాన్ దీక్ష పరుల నినాదాలతో మారుమరోగింది. ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ విశ్వ హిందూ పరిషత్ నాయకులు, హనుమాన్ దీక్షపరులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి





కోరుట్లలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, రాయికల్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు

ధర్మపురి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ధర్మపురి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహ చౌరస్తా వద్ద బాబు జగ్జీవన్ రామ్ రామ్ చిత్రపటానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, దళిత సంఘాల రాష్ట్ర కార్యదర్శి పారుపెల్లి రాజమల్లయ్య, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్ పాల్గొన్నారు.

●**గొల్లపల్లి:** గొల్లపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి విప్ లక్ష్మణ్‌కుమార్ నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు నిశాంత్‌రెడ్డి, తహసీల్దార్ వరందన్, పాల్గొన్నారు.

●గొల్లపల్లి మండల కేంద్రంలో బహుజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డా. బాబూ జగ్జీవన్ రామ్, డా. బీ.ఆర్. అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ కన్వీనర్ నక్క శంకరయ్య, ఏఎంసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిశాంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల నాయకులు శ్రీనివాస్, రమేష్, నాయకులు హన్మండ్లు, సత్తయ్య, తిరుపతి, వెంకటి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

●**కోరుట్ల:** జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి పౌరుడు కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నరింగ రావు అన్నారు. శనివారం పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆర్డీఓ జీవకర్ రెడ్డి, కమీషనర్ మారుతి ప్రసాద్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, అంబేద్కర్ సంఘ నాయకులతో కలిసి నివాళులర్పించారు.

●**కోరుట్ల రూరల్:** మండలంలోని అన్ని గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ సంఘ సభ్యులు ఘనంగా నిర్వహిచారు.

●**మెట్‌పల్లి టౌన్:** పట్టణంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. జువ్వాడి భవన్‌లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు నివాళి అర్పించారు.

●**ఇబ్రహీంపట్నం:** తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితదిరులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** ఆత్మనగర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నిజాముద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాలెపు నీలా, మాజీ ఉపసర్పంచ్ చిలివేరి విజయ్, సుమలత, రాజేందర్, భరత్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** కథలాపూర్, చింతకుంట, ఇప్పపల్లి, సిరికొండ గ్రామాల్లో దళిత సంఘాల నాయకులు జగజ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, గంగాధర్, బాలు, కిషన్ తదితరులు ఉన్నారు.

●**మల్లాపూర్:** మల్లాపూర్‌తో పాటు గుండంపల్లిల్లో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

●**మల్యాల:** మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ జడ్పీటీసీ రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ మిట్టపెల్లి సుదర్శన్, నాయకులు ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, అంబేద్కర్ సంఘ నాయకులు నలువాల సంజీవ్, మ్యాక లక్ష్మణ్, రవీందర్ పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండలంలోని వివిద గ్రామాల్లో, మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎలగుర్తి రవి, సంఘం నాయకులు స్వామి, ప్రసాద్, మహేష్, నర్సయ్య పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్ర పటానికి ఆర్‌ఐ రాజేశ్వరి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం దేశానికి ఆయన చేసిన సేవలు స్మరించుకున్నారు.

●**రాయికల్:** జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ హరీష్, రాజ్ కుమార్, ఫయాజ్ పాల్గొన్నారు. రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని ఇటిక్యాల, మైతాపూర్, అల్లీపూర్ గ్రామాల్లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ కొడిమ్యాల భూంరావు, సింగిల్ విండో చైర్మన్ యాదవనేని రాజలింగం పాల్గొన్నారు.

●**బీర్‌పూర్:** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళులుల అర్పించారు.

●**సారంగాపూర్:** మండలంలోని కస్తూర్బా బాలికల నిలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్సై దత్తాద్రి, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు పూడూరి శోభన్ పాల్గొన్నారు.

●**భీమారం:** మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బంగారు దీపక్, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాలలో తహసీల్దార్ బి. రవీందర్ , ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో మహేందర్, దళిత సంఘాల నాయకులు బత్తుల ప్రదీప్, బాబు, ఆరెల్లి లక్ష్మీరాజం, బొమ్మెన స్వామి, పొనగంటి రాజయ్య, ఇరుగురాల భూమేశ్వర్ పాల్గొన్నారు.



వెల్గటూర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి



మల్లాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వార్షిక, తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఏటా నిర్వహించే విధంగా మూడు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు నేరెళ్ల సంతోష్‌కుమార్, అరుణ్‌కుమార్, సముద్రాల వంశీ, నేరెళ్ల విజయ్, ఒద్దిపర్తి కళ్యాణ్‌కుమార్, ధర్మకర్తలు గుడ్ల రవీందర్, నేదునూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి



నృత్యం చేస్తున్న జ్యోతి హైస్కూల్ విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని సిద్దార్థ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫౌండర్ మంజుల రమాదేవి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి శ్రీధర్‌రావు అన్నారు. పట్టణంలోని స్థానిక జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో విస్మయం-2కే25 వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక అంశాలపై అవగాహన ప్రధానం అన్నారు. విద్యార్థులకు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధానమని, ఇవి ఒత్తిడి నుంచి ఉపశమనం కల్గిస్తాయన్నారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు బియాల హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, రజితరావు,అజితరావు, సుమన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

● యువకుడిపై కేసు నమోదు

మల్యాల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): భర్తతో విడిపోయి చిన్నారి కూతురుతో ఉంటున్న ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి కొన్నాళ్ల పాటు చనువుగా ఉన్న యువకుడు తీరా పెళ్లిచేసుకోకుండా మోసం చేశాడని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండగట్టుకు చెందిన ఓ మహిళ కొన్నాళ్ల క్రితం భర్తతో విడిపోయింది. వీరికి ఒక కూతరు కాగా అదే గ్రామానికి చెందిన పొన్నం అభి అనే యువకుడు ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో కొన్నాళ్లుగా ఇద్దరూ చనువుగా ఉంటున్నారు. అయితే ఇటీవల పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చిన మహిళ అభిని పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. దీంతో ఆమెను తన ఇంటికి తీసుకెళ్లాడు. రెండు రోజుల తరువాత అభితో పాటు అతని తండ్రి, తమ్ముడు ఆ మహిళను దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. అంతే కాకుండా చంపుతామని బెదిరించి ఇంట్లో నుంచి పంపించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీంతో మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

శ్రీరామచంద్రుడి చరిత్ర ధర్మానికి ప్రతీక

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 5 (ఆంధ్రజ్యోతి): తండ్రి మాటను జవదాటని కొడుకుగా, తల్లి కోసం రాజ్యాన్నే వదులుకున్న త్యాగశీలిగా, ధర్మం కోసం పోరాడిన శ్రీ రామచంద్రుడి చరిత్ర లోకానికి ప్రతీకని శ్రీసత్య ఆనంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థాస్వామి అన్నారు. మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీరామ కృష్ణ సంకీర్తన మండలి 56 వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భగవద్గీత పారాయణం, హవనము, పీఠాధిపతుల సందేశం వినిపించారు.

కొమిరెడ్డి రాములుకు ఘన నివాళి

కోరుట్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జువ్వాడి భవనంలో శనివారం మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములుకు వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమరేందర్, చంద్రశేఖర్‌లతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని కొమిరెడ్డి రాములు నివాసంలో శనివారం మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు 2వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి కొమిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొమిరెడ్డి విజయ్ అజాద్, మెట్‌పల్లి మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మెట్‌పల్లి బ్లాక్ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు హఫీజ్, పెంట ప్రణయ్, రైసోద్దీన్, యామ రాజయ్య, ఎర్రోళ్ల హనుమాండ్లు, రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

మల్లాపూర్: మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు వర్ధంతి సందర్భంగా శనివారం మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మండ్లుతో కలిసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, సురేష్, నరేష్, గంగుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : రాజకీయాల్లో అలుపెరగని పోరాటం చేసిన మాజీ ఎమ్మెల్యే, శాసనసభా పక్షనేత, సుప్రీంకోర్టు న్యాయవాది కొమిరెడ్డి రాములు వర్ధంతి వేడుకలు మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామంలోని పార్టీ కార్యాలయంలో కొమిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నమ్మిన సిద్ధాంతం కోసం కొమిరెడ్డి రాములు ఏనాడూ రాజీ పడలేని గొప్ప బీసీ నాయకుడిగా, విలక్షణమైన వ్యక్తిత్వానికి నిదర్శనంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామానుజం, జంగిటి రాజేందర్, జంగ స్వామి, గంగారెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం పట్టణానికి చెందిన పలువురు అంజన్న దీక్షాపరులు జువ్వాడి భవన్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసారు. కాశీబాగ్ హన్‌మాన్ ఆలయ నూతన అధ్యక్షుడిగా యామ రంజిత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కాగ యామ రంజిత్‌ను కాశీబాగ్ ఆలయ అధ్యక్షుడిగా ప్రకటించడంతో మద్దతు తెలిపి రంజిత్‌ను నర్సింగరావు పూలమాలలు, శాలువాతో సత్కరించారు. పట్టణంలోని పలు అలయలకు నిధులు మంజూరు చేయాలని దీక్షపరులు కోరగా నర్సింగరావు స్పందించారు. పట్టణంలోని అన్ని ఆలయల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. చిన్న వయసులో యువకులు భక్తి పట్ల శ్రద్ధ ఉండటం అభినందనీయం అన్నారు. ఆలయాల నిధుల మంజూరుకు ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మెట్‌పల్లి బ్లాక్ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు నాయిని సురేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు మార్గం గంగాధర్, పుదారి నర్సాగౌడ్, యామ రాజయ్య, ఎర్రోళ్ల హనుమాండ్లు, అంజన్న దీక్షపరులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గ్రహణం

● పోసానిపేటలో 115 మంది లబ్ధిదారుల ఎంపిక ● కేవలం ఐదు నిర్మాణాలు మాత్రమే ప్రారంభం

కథలాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గ్రహణం పట్టుకుంది. మండలంలోని 19 గ్రామాలకుగాను పైలెట్ ప్రాజెక్ట్ కింద పోసానిపేటను ఎంపిక చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రయోగాత్మకంగా ఒక్క గ్రామంలో వంద శాతం అమలు చేయాలని నిర్ణయించారు. హడావుడిగా ప్రభుత్వం గ్రామంలోని రైతులందరికీ రైతుబంధు విడుదల చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి పూనుకున్నారు. 115 మంది ఇళ్ళు లేని వారు దరఖాస్తు చేసుకోగా మంజూరు పత్రాలు అందజేశారు. రెండు మాసాల కింద 15 గృహాల నిర్మాణాలకు అధికారులు ముగ్గులు పోశారు. ఇప్పటికీ కేవలం ఐదుగురు మాత్రమే పనులు కొనసాగిస్తున్నారు. ఇందిరమ్మ లబ్దిదారులకు మూడు దశల్లో బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ లబ్దిదారులకు ఇళ్ళ నిర్మాణాలు చేపట్టడానికి ముందుకు రాకపోవడం పట్ల అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం ఉండదని చెబుతున్నప్పటికీ ఇళ్ళు మంజూరైన వారు పనుల ప్రారంభానికి సందేహిస్తున్నారు.



పోసానిపేటలో పనుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నిర్మాణాలను పర్యవేక్షణ చేస్తున్నాం

-శంకర్‌నాయక్, ఎంపీడీవో



ఇళ్ళ మంజూరు పత్రాలు అందజేసిన వారితో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడ పర్యవేక్షణ చేస్తున్నాం. ఐదుగురు లబ్దిదారులు పనులు ప్రారంభించగా పిల్లర్ల దశలో కొనసాగుతున్నాయి. మిగిలిన వారికి కూడా అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా అధికారులు కూడా పర్యవేక్షణ చేస్తున్నారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-ఎంజీ రెడ్డి , మాజీ సర్పంచ్,



ఎన్నో ఏళ్ళ అనంతరం ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. మొదట స్థలం ఉన్న వారిని ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందజేశారు. ఇళ్ళకు అవసరమైన పూర్తి మెటీ రియల్ స్థానికంగా అందుబాటులో ఉన్నందు వల్ల నిర్మాణాలు చేపట్టుకోవాలి. అధికార యంత్రాంగ ప్రత్యేక దృష్టి సారిస్తే విజయవంత మవుతుంది.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదుగాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ జువ్వాడి నర్సింగ రావు అన్నారు. శనివారం పట్టణంలోని బీమునిదుబ్బ ప్రాంతంలోని రేషన్ దుకాణంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని ప్రారభించి 13, 15, 19వ వార్డులలో అభివృద్ధి పనులకు స్థానిక నాయకులతో కలిసి భూమి పూజల చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జువ్వాడి నర్సింగ రావు మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి అన్ని వర్గాల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తూ పలు పథకాలను రూపోదించి ప్రజలకు అందిస్తూన్నాడని అన్నారు. కాంగ్రెస్ పభ్యుత్వ ఇచ్చిన హామీలు నేరవేరుస్తూ ప్రజల సమస్యలను తీర్చుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ శీలం వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ల్ అడెపు కమల - మధు, సంగ లింగం, సోగ్రబీ నాయకులు తిరుమల గంగాదర్, దశరథం, పుప్పాల ప్రభాకర్, బాజన్న, తిరుమల గంగాధర్, కవిత, గుర్రాల ప్రవీణ్, నహీం, ముల్క ప్రసాద్, రియాజ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తాం



పెగడపల్లిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అర్హత గల ప్రతి కుటుంబానికి తెల్ల రేషన్ కార్డులు అందజేస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ పథకాన్ని శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఏఎస్‌ఓ, మండల కాంగ్రెస్ నాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

●గొల్లపల్లి : తెల్ల రేషన్ కార్డుదారులందరికీ నాణ్యమైన సన్న బియ్యంను అందజేస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కోన్నారు. శనివారం గొల్లపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంను ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు.

●ఎండపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల సంక్షేమానికే తమ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎండపల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్నబియ్యం కార్యక్రమం నిరుపేదలకు ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, గుండాటి గోపిక జితెందర్ రెడ్డి, పోలోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ధర్మపురి, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పలువురు వక్తలు అన్నారు. ధర్మపురి మండల కేంద్రంలోని జడ్పీ హెచ్‌ఎస్ (బాలికల) ఉపాధ్యాయులు, తెలుగు పండితులు గుండి శంకర్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థుల మేధా శక్తిని పెంచే ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలన్నారు. గుండి శంకర్ సేవలను కొనియాడారు. అనంతరం గుండి శంకర్‌ను పలువురు పూల మాలలు వేసి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కొలిచాల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంతఃవోలు ఆనంద్‌రావు, యాళ్ల అమరేందర్‌రెడ్డి, సూద రాజేందర్, రఘుశంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాంరెడ్డి, సురేందర్‌కుమార్, గాదె శ్రీనివాస్, దహెగాం గణేష్, సీతాలక్ష్మి, నాగభూషణం, కిశోర్, మాదాసు రమేష్‌బాబు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ చైర్మన్‌గా లక్ష్మన్

మల్యాల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అంబెద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ముత్యంపేటకు చెందిన దళిత సంఘాలు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మ్యాక లక్ష్మన్‌ను ఎన్నుకున్నారు. ఈ నెల 14న నిర్వహించే అంబెద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ఈ కార్యక్రమంకు గాను చైర్మన్‌తో పాటు సభ్యులను, సలహాదారుల నియమాకం జరిగినట్లు ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు నలువాల సంజీవ్ తెలిపాడు. జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చైర్మన్ మ్యాక లక్ష్మన్ ఈ సందర్భంగా తెలిపాడు.

నియామకం

ఎండపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండల అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీని నూతనంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలో చుంచు మల్లేశం, గాధం భాస్కర్, పడిదం వెంకటేష్, మంతెన లక్ష్మణ్, మంతెన సంజీవ్, గంధం రవి, తదితరులు పాల్గొన్నారు.